

# కథా కౌముది

## అమ్మ

ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్

అది ఊరికి దూరంగా ఉన్న బంజరు భూమి.నిజానికి దానిని భూమి అనడం కన్నా చిట్టడవి అనడం న్యాయం. ఎక్కడ చూసినా ముళ్ళ చెట్లు, పిచ్చి మొక్కలు, దట్టంగా అల్లుకున్న రకరకాల తీగలు, పొదలు. సరిగ్గా చెప్పాలంటే అది మనుషులు ఉండదగ్గ, ఉండే స్థలం కాదు. బహుశా ఇంకా అది ఎవరి దృష్టిలో పడలేదు కాబోలు బంజరు భూమిగానే మిగిలి పోయింది.

కానీ ఊరిలో ఎక్కడా ఉండే స్తోమత లేక, ఉన్న ఇళ్ళకు అద్దె ఇచ్చుకోలేక, అక్కడ గుడిసెలు వేసుకుని నివసిస్తున్నాయి కొన్ని కుటుంబాలు.అక్కడ ఉన్న అందరూ కూలి, నాలి చేసుకునే బతికే వారు, వారి కుటుంబాలు. .కాకపోతే ఎక్కువ కుటుంబాలు తమ శక్తికి మించింది అయినా తమ పిల్లలని చదివిస్తున్నాయి. తమ కంటే తమ పిల్లలు ఉన్నత స్థితిలో ఉండాలనుకోవడం సహజం కదా.చిన్న పెద్దా కలిసి ఒక ఏభయ్ మంది వరకూ ఉంటారు అక్కడ.

ఆ రోజు ఉదయం కూడా ఎప్పడి లాగే తెల్లారింది. అక్కడి మనుసులు తమ తమ పనులలో నిమగ్నం అయి ఉన్నారు. ఉదయం పది గంటలు అయ్యింది. చదువుకునే పిల్లలు స్కూళ్ళకి వెళ్ళారు. తక్కిన వాళ్ళలో పెద్ద పిల్లలు పొలాల గట్ల మీద ఆడుకోడానికి వెళితే, మరీ చిన్న పిల్లలు ఇళ్ళలో ఉండి పోయారు. మగవారు అందరూ, ఆడవారిలో కొంత మంది పనులకి బయటకి వెళిపోతే ,ఇంట్లో ఉన్న ఆడవాళ్ళు వంట ప్రయత్నం లో ఉన్నారు. వాళ్ళ జీవితాలలో ఇంచుమించు రోజూ అలాగే ప్రారంభం అవుతుంది.

కానీ ఆరోజు అసలు ఎవరూ ఊహించని ,అనుకోని సంఘటన జరిగింది.అది వాళ్ళ జీవితాలను చిన్నాభిన్నం చేసింది.ఒక్కసారిగా ఒక గుడిసెలో పెద్ద అగ్ని కీల లేచింది.బలంగా గాలి వీస్తూ ఉండడం వలన క్షణాలలో అగ్ని అన్ని గుడిసెలను ఆక్రమించుకుంది. అంతటా హాహాకారాలు మొదలు అయ్యాయి.ఇంట్లో ఉన్న వాళ్ళు కంగారుగా, ముందుగా పసిపిల్లలను,ముసలి వాళ్ళను ఇళ్ళ లోంచి బయటకు తీసుకువచ్చారు.తరువాత ముఖ్యమైన సామానులను తీసుకు వచ్చే ప్రయత్నం చేసారు. కానీ భయకరంగా ఎగసిపడ్డ అగ్ని జ్వాలలు వాళ్ళకి సామానులు తీసుకునే అవకాశం ఇవ్వలేదు.అంతలో జరిగిన విషాదం గురించి తెలిసి, పనికి వెళ్ళిన వాళ్ళు పరుగు పరుగున అక్కడకు చేరుకున్నారు.వాళ్ళలో కొంత మంది మంటలను ఆర్పే ప్రయత్నం చేసారు. కానీ వాళ్ళకి నీరు దరిదాపుల్లో లభించలేదు.నిజానికి వాళ్ళ చుట్ట పక్కల ఉన్న నీటివసతులు వాళ్ళకి తాగడానికే సరిపోవు!!?? అయినా ఉన్న కొంచం నీటితో ఏదో విధంగా మంటలను అదుపు చేయాలనీ ప్రయత్నించారు. వాళ్ళ ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. చూస్తుండగానే అన్ని గుడిసెలు పరశురామ ప్రీతి అయిపోయాయి. అక్కడ బతుకుతున్న వాళ్ళ దుఃఖానికి అంతు లేకుండా పోయింది. దాదాపు అందరూ కట్టుబట్టలతో మిగిలారు. ఆడవాళ్ళ రోదనలు మిన్ను ముట్ట సాగాయి.పిల్లలు గోలగా అరుస్తూ ఉంటే,మగవాళ్ళు విషణ్ణ వదనాలతో నిలబడి ఉన్నారు.

అంతలో ఫైర్ ఇంజిన్ వచ్చింది.పూర్తిగా బూడిద అయిన ప్రదేశం మీద నీళ్ళు జల్లింది .నిజానికి ఫైర్ సర్వీస్ వాళ్ళు వచ్చేసరికే జరగాల్సింది అంతా జరిగిపోయింది.

విషాదం జరిగిన గంటలోపే పత్రికల వాళ్ళు,టీ వీ వాళ్ళు అక్కడకి చేరుకుని'అసలు ప్రమాదం ఎలా జరిగింది !!??ఎప్పుడు ఎవరు ముందుగా చూసారు !!?? మంటలను ఆర్పే ప్రయత్నం ఎలా చేసారు !!??' లాంటి ప్రశ్నలతో అక్కడ వారిని ఉక్కిరి బిక్కిరి చేయడం ప్రారంభించారు. ఎవరికి తోచిన సమాధానాలు వాళ్ళు చెప్పారు.నిజానికి కారణాలు ఎవ్వరికీ తెలియదు.ఎవరు ఏమి చెప్పినా ,ఏమి వివరించినా కేవలం ఊహే!!??

కొద్ది సేపటికి వివిధ రాజకీయ పక్షాల నాయకులూ అక్కడకు చేరుకున్నారు.

'ఇంతటి భారీ అగ్ని ప్రమాదం జరిగి అన్ని కోల్పోయిన వారికీ మా సానుభూతి. జరిగిన దానికి విచారిస్తున్నాం అని' ఒకరంటే

'ఈ పేదల నష్టాన్ని పూరించడం లో నా వంతు కృషి చేస్తా 'అని ఒకరు అన్నారు.

'బాధితుల ని పూర్తిగా ఆదుకునే వరకు నేను నిద్ర పోను' అని ఒకరు ప్రగల్భాలు పలికారు.

ఇంకొక ఆయన 'జరిగిన విషాదాన్ని చూస్తుంటే నా గుండె తరుక్కు పోతోంది.నాకు కన్నీళ్ళు ఆగటం లేదు' అంటూ కళ్ళు కండువాతో తుడుచుకున్నాడు.పొగ వల్ల తన కళ్ళు మండి ,నీళ్ళు వచ్చాయి అన్న సంగతి ఎవరైనా గ్రహిస్తారేమోనని చుట్టూ పక్కల చూస్తూ ఆ మాటలు అన్నాడు.కానీ ఎవరు అవి పట్టించుకునే స్థితిలో లేరు.ఒకరిద్దరు అసలు విషయం గ్రహించినా నవ్వుకుని ఊరుకున్నారు.

మెల్లగా అక్కడ వాతావరం మరోరకంగా వేడి ఎక్కడం మొదలు పెట్టింది. వివిధ రాజకీయ నాయకుల మధ్య వాగ్వివాదాలు మొదలయ్యాయి .దానికి కొందరు పత్రికల వాళ్ళు, టీవీల వాళ్ళు నెయ్యి ,సమిధలు వేయసాగారు.క్రమంగా అసలు విషయం దారి మళ్ళింది. పెద్ద గందర గోళం ప్రారంభం అయ్యింది.

అప్పుడు జరుగుతున్నదంతా ఛానల్ వాళ్ళకి ,పత్రికల వాళ్ళకి మంచి ఆహారం లభించినట్లయింది.

ప్రమాదం జరిగి చాలా సేపయ్యింది. వచ్చిన వాళ్ళు ఎవరి గొడవలో వాళ్ళు మునిగిపోయారు.

బాధితులు అక్కడకు వచ్చిన వాళ్ళ వైపు ఆశగా ,నిస్సహాయంగా చూస్తూ ఉండి పోయారు.

కొంత సేపటికి ఒక నాయకుడు 'రెండు రోజులలో మీ గుడిసెలు కట్టిస్తాం' అంటూ ప్రకటించాడు.

'నష్ట పోయిన ప్రతి కుటుంబానికి లక్ష చొప్పున పరిహారం ఇప్పించే బాధ్యత నాది 'అని ఇంకొక నాయకుడు బిగ్గర గా అరిచాడు.

'ప్రతి కుటుంబానికి బస్తా బియ్యం,వంట సామానులు అందించే పూచీ నాది'ఇంకొక నాయకుని హామీ.

'ఇంటికొక ఉద్యోగం వచ్చే వరకూ పోరాడుతాను!!' అంటూ ఇంకొక నాయకుడు తన పోరాట ప్రతిమ వెల్లడించాడు.

ఏ ఒక్కరూ తమ హామీలను నిజంగా నిలుపుకోక్కర్లేదని వాళ్ళకి తెలుసు!!??ఫ్రీగా చేసే ఎన్ని వాగ్ధానాలు అయినా చెయ్యవచ్చు కదా!!??

ఒక్క మాటలో చెప్పాలంటే భాధితుల గురించి అంత వరకు నిజంగా పట్టించుకున్న నాధుడు ఒక్కడూ లేడు!!??

కొంత సేపటికి నాయకుల హడావిడి తగ్గింది.

అప్పుడు హడావిడిగా స్వచ్ఛంద సంస్థల వాళ్ళు రంగ ప్రవేశం చేసారు.

పోటా పోటీగా బాధితుల మీద ప్రశ్నల వర్షం కురిపించారు.అప్పడికి అవే అవే పది సార్లు చెప్పిన బాధితులకి విసుగు,కోపం,అసహనం కలిగాయి.అసలే ఇల్లు,సర్వస్వం కోల్పోయి బాధ పడుతుంటే ఈ ప్రశ్నల పరంపరలు ఏమిటా అని తలలు పట్టుకు కూచున్నారు.

కానీ వచ్చిన వాళ్ళు ఏది అయినా సహాయం చెయ్యక పోతారా అని ఆశగా,ఓపికగా అన్నిటి ప్రశ్నలకి సమాధానం ఇవ్వసాగారు.

'మేము మీ పిల్లలకు జీవితాంతం స్కూల్ ఫీజులు భరిస్తాం.వాళ్ళకి ఉచిత ట్యూషన్ సదుపాయాలు కలగాజేస్తాం.'ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వాగ్దానం.

'మీ ఇళ్ళల్లో ఆడవారికి వృత్తి నైపుణ్యం లో ట్రైనింగ్ ఇప్పిస్తాము.వాళ్ళు ఎవరి కాళ్ళ మీద వాళ్ళు నిలబడేలా తర్ఫీదు ఇస్తాం.ఇంటి దగ్గరే కూచుని డబ్బు సంపాదించుకునే మార్గం ఏర్పాటు చేస్తాం.స్త్రీలను అన్ని విధాలా స్వతంత్రులు అయ్యేలా చూస్తాం .'హామీల వర్షం గుప్పించింది మరొక స్వచ్ఛంద సంస్థ.

'ఇక్కడ నివసించే ప్రతి ఒక్కరూ ఉచితంగా చదువుకునేలా ఏర్పాటు చేస్తాం .రాత్రి పాఠశాల,వయోజన విద్య కల్పిస్తాం.అక్షరాస్యతతో లోక జ్ఞానం మెరుగు పడుతుంది .సంపాదించే శక్తి పెరుగుతుంది.మీలో ప్రతి ఒక్కరూ మంచి విద్యవంతులయ్యేలా చూస్తాం 'మరొక స్వచ్ఛంద సంస్థ హామీ.

విచిత్రం ఏమిటంటే ఎన్నో రకాల సహాయాలు అందిస్తానన్న స్వచ్ఛంద సంస్థలలో ఏవి నిజంగా సేవ చేస్తాయో,వేటికి గుర్తింపు ఉందో ఆ భగవంతునికే ఎరుక!!??

అలా రక రకాల వ్యక్తుల హామీలతో నిజంగా ఆ క్షణంలోనే అవి పొందినంత సంతోషం లో మునిగి పోయారు అగ్ని ప్రమాద బాధితులు.

మెల్లిగా మధ్యాహ్నం అయ్యింది.వచ్చిన వాళ్ళు ఎక్కడ వాళ్ళు అక్కడకు వెళ్ళిపోయారు.

ఇక మిగిలింది ఆ ప్రాంతం వాళ్ళు.

ఒక్కక్కొరు తాము ఏమి కోల్పోయారో చెప్పుకోవడం ప్రారంభించారు. ఒక కుటుంబం తమ కూతురు పెళ్లి కోసం పైసా పైసా కూడబెట్టి దాచుకున్న డబ్బు అంతా బూడిద అయి పోయిందని బోరుమంది.

ఇంకొక కుటుంబం తమ కొడుకుకి ఫీజు కట్టడానికి ఇంట్లో పెట్టిన డబ్బు,అంతకు ముందు రోజే కొనుక్కున్న పుస్తకాలు చూస్తుండగానే మసి అయిపోయాయని బావురుమంది.

ఇంకొక కుటుంబానిది మరీ దీన గాధ. ముసలిది అయిన యజమాని తల్లికి వైద్యం చేయిద్దామని ,అప్పు చేసి తెచ్చిన న డబ్బు,అలాగే ఆవిడకి ఒకరు దయతో చేయించి ఇచ్చిన కృత్రిమ కాలు అగ్నికి ఆహుతి అయ్యిపోయాయి.ఇప్పుడు ఆ ముసలావిడ ఎలా నడుస్తుంది!?ఎలా బతుకుతుంది??

ఇలా ఒకరికి ఒకరు తమ దీన గాధలు చెప్పుకుంటూ, కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంటూ,ఒకరిని ఒకరు ఓదార్చుకుంటూ కూచుని ఉన్నారు.

చిత్రం ఏమిటంటే అంతదాకా హామీలు గుప్పించిన ఎవ్వరూ ఆ విషయాలు అడగక పోవడం, చర్చించకపోవడం.వాళ్ళు వచ్చిన ప్రయోజనం వేరు !!??

అంతలో అటుగా ఓ ముసలి స్త్రీ నడుచుకుంటూ వచ్చింది.అసహ్యకరమైన బట్టలతో,మురికి ఓడుతూ ఉంది.ఆమె వేషధారణ ఆమె బిచ్చకత్తె అని చెప్పకనే చెపుతోంది.

ఆమెని చూసేసరికి అక్కడి వాళ్ళంతా చిరాకు పడ్డారు. అక్కడ ఉన్న వాళ్ళు తాము సర్వం కోల్పోయి ఉంటే, ఆ సమయంలో అడుక్కోడానికి ఆమె ఎలా వచ్చింది, అని అందరూ కోపం,అసహ్యం మిళితమైన భావం తో ఆమెను చూడసాగారు.

అదేమీ పట్టనట్టు ఆమె వాళ్ళకు బాగా దగ్గరగా వెళ్ళింది.

"అయ్యో ఇళ్ళు కాలి పోయినట్లున్నాయే!!??"అని అడిగింది ఆమె.

అక్కడ ఉన్న ఒక వ్యక్తికి నషాళం అంటి పోయిందేమోగాని 'అబ్బే లేదు !!సరదాగా దీపావళి జరుపుకున్నాం' అన్నాడు విపరీతమైన కోపంతో.

"అదేమిటి బాబూ అలాగన్నావు!!??.....నా పేరు పార్వతి ...... నేను పెద్ద దానినే .కానీ అంత గుడ్డి దానిని ,తెలివి తక్కువదానిని కాదు." అంది శాంతంగా.

"ఇక్కడ నీ పేరు, అడ్రెస్స్ ఎవరకీ అక్కర్లేదు . నా పేరు వీరబాబు ....అయితే ఏమిటట!!??" అంటూ కోపంగా ప్రశ్నించాడు వీరబాబు అనే అతను.

"అంత కోపం ఎందుకు బాబూ..."ఏదో చెప్పబోయింది పార్వతి.

"చాలు వెళ్ళవమ్మా ...అడుక్కోడానికి సమయం సందర్భం ఉండక్కర్లేదా!!??" కోపంగా అరిచాడు వీరబాబు.

"అయ్యో బాబూ ...నేను అడుక్కునే దాన్నే కాదనను ......కానీ ఇప్పుడు మీ దగ్గరికి అడుక్కోడానికి రాలేదు.." అంది పార్వతి.

"ఓహో!! విందు చెయ్యడానికి వచ్చావా !!?? విసిగించక పో....పొద్దున్నుంచి వచ్చే వాళ్ళు ,వెళ్ళేవాళ్ళతో విసిగిపోయి ఉన్నాం." అంటూ తన చూపుడు వేలితో పొమ్మన్నట్టు సంజ్ఞ చేసాడు.

“చూడు బాబు .....”అంటూ ఏదో చెప్పబోతున్న పార్వతిని చేయ్యపట్టుకుని లాక్కు వెళ్ళబోతున్న వీరబాబుని అక్కడ కుటుంబాలలోని ఒక వయస్సు మళ్ళిన స్త్రీ వారించింది.

“అమ్మా...నీకన్నా నా మీద దయ కలిగింది......అమ్మా నేను ఇక్కడ అడుక్కోడానికి రాలేదు.”అంది పార్వతి ఆ పెద్దామెని ఉద్దేశించి .

“మరెందుకు వచ్చినట్టు!!??”వీరబాబు స్వరం లో కోపం తగ్గలేదు.

“వీరూ...”పెద్దావిడ అతనిని సముదాయించడానికి ప్రయత్నించింది.

“నీకు తెలీదు పెద్దమ్మా .ఇటువంటి వాళ్ళు ఈ హడావిడిలో వీలు చూసుకుని చేతికి అందినది పట్టుకుపోతారు.”అన్నాడు వీరబాబు.

“బాబూ...మరీ అంత అన్యాయంగా మాట్లాడకు.....నేను అడుక్కునే దాన్నే కావచ్చు కానీ దొంగను కాదు....అమ్మా నీతో ఒక నిమషం మాట్లాడవచ్చా !!??”అంది పార్వతి ఆ పెద్దామె వైపు తిరిగి.

వీరబాబు ఏదో అనబోతే పెద్దామె వారించింది.

“చూడమ్మా .. ....మా పరిస్థితి చూసావు కదా ...ఇప్పుడు మేమే అడుక్కునే వాళ్ళలా అయిపోయాం....” అంది ఆ కుటుంబాలలో పెద్దమ్మ .

“అమ్మా .నేను అడుక్కోడానికి రాలేదు. చేతనైన సహాయం చేద్దామని వచ్చాను.” అంది పార్వతి నెమ్మదిగా .

“ఏమిటి!!?? ...నువ్వు...సహాయం ..చేయడానికి వచ్చావా!!??” ప్రతి మాట వత్తుతూ పలికాడు వీరబాబు.

“ఉదయం నుంచి చాలా మంది వచ్చి మమ్మల్ని ఊదరగొట్టి వెళ్ళారు. ఇక ఇప్పుడు నువ్వు వచ్చావు ఏదో గొప్ప సహాయం చెయ్యడానికి!!?? “ అన్నాడు వీరబాబు వ్యంగంగా.

“అవును బాబూ.... నువ్వు అన్నట్టుగా పెద్ద సహాయం ఏమీ చెయ్యలేను గాని నాకు తోచింది ,నేను చెయ్యగలిగింది చేద్దామనుకుంటున్నాను........ .ఈ కార్తీక మాసమంతా నేను ఉండే గుడి కి జనం బాగా వచ్చారు......ప్రజలలో ధర్మ గుణం ఎక్కువ అయ్యిందో ఏమో..” అంటూ నవ్వింది పార్వతి.

మరల చెప్ప సాగింది పార్వతి ”నా దగ్గర అయిదు వేల రూపాయల వరకు ఉన్నాయి “ అంటూ తన దగ్గర ఉన్న సంచి లోంచి వందల నోట్లు బయటకు తీసింది.

“మాములుగా చిల్లరకి ఎక్కువ డబ్బులిస్తారు కదా. అలాగా కొంచెం ఎక్కువ వచ్చింది.. పరిస్థితి చూస్తే మీరు ఎవ్వరూ తినడానికి కూడా ఏమి మిగల్చలేదు ఆ అగ్ని దేవుడు. నువ్వు అయితే కుర్రాడివి రెండు రోజులు తినక పోయినా ఉండ గలవు .పాపం పెద్ద వాళ్ళు,పిల్లలు తినకుండా ఉండలేరు కదా ....మీరు అందరూ ఈ పూటకి భోజనం చేయడానికి ఈ డబ్బులు సరిపోతాయికదా. ఈ డబ్బు ఉంచు. మీ అమ్మ ఇచ్చింది అనుకో. .ఇది ఖర్చు అయిపోయిన తరువాత మీ బాధలేవో మీరు పడుదురు గాని .”అంటూ తన దగ్గర ఉన్న డబ్బు అంతా వీర బాబు చేతిలో పెట్టింది.

ఆ క్షణంలో వీరబాబు ముఖం లో ఎన్నో తెలియని భావాలూ ప్రవేశించాయి.అయితే ఆశ్చర్యం అన్నింటిని అధిగమించింది.

‘ఉదయం నుంచి వచ్చిన వాళ్ళంతా శుష్క ప్రియాలు చెప్పి , శూన్య హస్తాలు చూపించారు. వాళ్ళు ఎప్పుడో ఏదో ఒరగ పెడతామని చెప్పారు.ప్రస్తుత పరిస్థితి అర్థం చేసుకున్నవారు ఒకరూ లేరు.తమకు వెంటనే కావలిసింది ఎవరూ పట్టించుకోలేదు. తమకు ప్రస్తుత అవసరం ఆకలి తీర్చుకోవడం ..... అమ్మ రూపం లో ఉన్న ఈ దేవత అందరి కడుపు నింపడానికి వచ్చింది. తల్లికంటే పిల్లల ఆకలి ఎవరికీ తెలుస్తుంది !? ఛీ! అటువంటి దేవత గురించి ఎంత నీచంగా ఊహించుకున్నాను.’ అనుకున్నాడు వీరబాబు.

“అదేమిటి నువ్వు...మాకు ఇవ్వడం..అది కాక ఉన్నదంతా మాకు ఇచ్చేస్తే.........!!??” అర్థోక్తిలో ఆగిపోయాడు వీరబాబు.

“అయ్యో నాదేముంది బాబూ ...గుడిలో పది రూపాయిలు రాకపోవు...... అయినా ఏ క్షణం లోనన్నా రాలి పోయే ఈ పండుటాకుకు ఆ దేవుడే రక్ష. వస్తాను బాబూ ......వస్తానమ్మా” అంది పార్వతి.

“అమ్మా ...”అంటూ కళ్ళల్లో కృతజ్ఞతతో నిండిన అశ్రువులు తో ఆ అన్నపూర్ణ కి ,జగజ్జననికి, అమ్మల గన్నఅమ్మకి నమస్కరించాడు వీరబాబు.అతనితో ఎన్నో చేతులు కలిసాయి###

★★★★